ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 26 మార్చి 2025

పది మంది ఐపీఎస్‌ల బదిలీ

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పది మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేశారు. రామనాథపురం రేంజ్ డీఐజీ డా.అభినవ్‌కుమార్ మదురై రేంజ్ డీఐజీగాను, తిరునల్వేలి రేంజ్ డీఐజీ డా.పా.మూర్తి రామనాథ పురం రేంజ్ డీఐజీగా బదిలీ అయ్యారు. తిరున ల్వేలి సిటీ కమిషనర్ డా.సంతోష్ హదిమాని తిరునల్వేలి రేంజ్ డీఐజీగా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. గ్రేటర్ చెన్నై పరిధిలోని వాష ర్‌మెన్‌పేట డిప్యూటీ కమిషనర్ ఆర్.శక్తివేల్ గ్రేటర్ చెన్నై ఇంటెలిజెన్స్ విభాగం-1 డిప్యూటీ కమిషనర్‌గాను, చెన్నై ఈస్ట్ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ డా.వి.భాస్కరన్ వాషర్‌మెన్‌పేట డిప్యూటీ కమిషనర్‌గాను, చెన్నై వెల్ఫేర్ అండ్ ఎస్టేట్ డిప్యూటీ కమిషనర్ ఎస్.మేఘలీనా ఐడెన్ చెన్నై ఈస్ట్ డిప్యూటీ కమిషనర్‌గాను, మైలాపూర్ డిప్యూటీ కమిషనర్ డీఎస్ హరికిరణ్‌ప్రసాద్ చెన్నై వెల్ఫేర్ అండ్ ఎస్టేట్ డిప్యూటీ కమిషన ర్‌గా బదిలీ అయ్యారు. అలాగే, తమిళనాడు స్పెషల్ పోలీసు ఎస్పీ వి.కార్తీక్ మైలాపూర్ డిప్యూటీ కమిషనర్‌గాను, ఈరోడ్ ఎస్పీ జి.జవహర్ చెన్నై సీబీసీఐడీ ఎస్పీగాను, తిరుప్పూర్ నార్త్ డిప్యూటీ కమిషనర్ ఎ.సుజాత ఈరోడ్ ఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్ మంగళ వారం ఉత్తర్వులు జారీచేశారు.



శాసనసభలో ద్విభాషావిధానంపై ప్రవేశపెట్టిన సావధానతీర్మానంపై ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి

కేంద్రం బెదిరించినా ద్విభాషే మా విధానం

హిందీని అనుమతిస్తే మాతృభాషకు మరణమే ● అసెంబ్లీలో సీఎం స్టాలిన్ పునరుద్ఘాటన

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం పేరుతో రాష్ట్రంలో త్రిభాషా విద్యావిధానాన్ని ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామని, ఈ విష యంలో వెనుకంజ వేసే ప్రసక్తే లేదని రాష్ట్రము ఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తేల్చిచె ప్పారు. శాసన సభలో మంగళ వారం ద్విభాషా విద్యావిధానంపై ప్రవేశపెట్టిన సావ ధాన తీర్మానంపై ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడినా, నిధులివ్వ కపోయినా ఎట్టి పరిస్థితుల్లోనూ త్రిభాషా విద్యా విధానాన్ని రాష్ట్రంలో అడుగుపెట్టనివ్వబోమని స్పష్టంచేశారు. కేంద్రం త్రిభాషా విద్యావిధానం పేరుతో రాష్ట్రంలో హిందీ నిర్బంధంగా అమలు చేయడానికి తీవ్ర ప్రయత్నిస్తోందని, హిందీని తృతీయ భాషగా అనుమతిస్తే మాతృభాష తమిళం మృతభాషగా మారిపోతుందన్నారు. సావధాన తీర్మానంపై బీజేపీ మినహా అన్ని పార్టీలూ ఒకే మాటగా ఒకే బాటగా ద్విభాషా విద్యావిధానానికి గట్టి మద్దతిస్తూ ప్రసంగిం చడం హర్షదాయకమన్నారు. ప్రధాన ప్రతిపక్షం ఉపనేత ఆర్‌బీ ఉదయకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుండి త్రిభాషా విద్యావిధా నాన్ని అంగీకరించాలని ప్రభుత్వానికి ఓ లేఖ వచ్చినట్లు తెలిసిందని చెప్పారని, ఆ లేఖకు రాష్ట్ర ప్రభుత్వం ఘాటైన సమాధానమే ఇచ్చిం దన్నారు. ఎట్టి పరిస్థితులలో త్రిభాషా విద్యావిధానాన్ని అనుమతించబోమని కేంద్రానికి స్పష్టపరచినట్లు ఆయన చెప్పారు.

ఢిల్లీ నేతలకు ఈపీఎస్ వివరించాలి...

ప్రధానప్రతిపక్షం ఉప నేత ఆర్‌బీ ఉదయకు మార్ మాట్లాడుతూ ద్విభాషా విద్యావిధానానికి తామెల్లప్పుడూ గట్టి మద్దతునిస్తామని భరోసా ఇచ్చారని గుర్తు చేసిన సీఎం.. ఢిల్లీ వెళ్లిన ఆ పార్టీ అధినేత ఈపీఎస్ ఎవరితో భేటీ అయినా రాష్ట్రంలో త్రిభాషా విద్యావిధానానికి తావులేదని కుండబద్దలు కొట్టినట్లు ప్రకటించాలని సభాము ఖంగా విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. కేంద్రప్ర భుత్వం రెండువేల కోట్లు కాదు..

పదివేల కోట్లిచ్చినా రాష్ట్రంలో త్రిభాషా విద్యావిధానాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. నిధుల కంటే మాతృభా షను కాపాడుకోవడమే తమకు ముఖ్యమని, ఇది ఆర్థిక సమస్య కానేకాదని, ఓ (తమిళ) జాతికి సంబంధించిన ప్రధాన సమస్య అని ఆయన చెప్పారు. 1968 జనవరి 23న ఈ అసెంబ్లీలోనే మాజీముఖ్యమంత్రి అన్నాదురై ద్విభాషా విద్యావిధానంపై స్పష్టమైన తీర్మానం ప్రతిపాదించారని, ఆ మహానాయకుడి బాట లోనే మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి రాష్ట్రంలో నిర్బంధ హిందీకి తావులేదని తేల్చిచెప్పారని, ఆ దిశగానే తాను కూడా త్రిభాషా విద్యావిధా నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్టాలిన్ శపథం చేశారు. రాష్ట్ర హక్కులను పరిరక్షిం చడం, ద్విభాషా విద్యావిధానాన్నే అమలు చేయడం, మాతృభాషను కాపాడుకోవడం, తమి ళసంస్కృతీ సంప్రదాయాలను దేశవిదేశాలకు వ్యాపింపచేయడమే తమ ప్రధాన ఆశయాలని స్టాలిన్ పేర్కొన్నారు.

28న టీవీకే సర్వసభ్యమండలికి భారీ ఏర్పాట్లు

● సభ్యులకు డిజిటల్ గుర్తింపు కార్డులు
● ప్రతి జిల్లా నుంచి ఓ మహిళా నేత



సర్వసభ్యమండలి సభ్యులకు డిజిటల్ గుర్తింపు కార్డులు అందజేస్తున్న టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం తొలి రాజకీయ సర్వసభ్యమండలి సమావేశం ఈ నెల 28న తిరువాన్మి యూరులోని రామచంద్రా కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నారు. నటుడు విజయ్ పార్టీని ప్రారంభించి యేడాది పూర్తయిన సంద ర్భంగా జరుగనున్న తొలి సర్వసభ్యమండలి సమావేశం కావడంతో అట్టహాసంగా నిర్వహించే విషయమై పార్టీ అధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఇతర నేతలు ప్రతిరోజూ చర్చలు జరుపుతున్నారు. ఈ సమావేశానికి వచ్చే పార్టీ జిలా కార్యదర్శు లందరికీ తగిన ఏర్పాట్లు కల్పించాలని నిర్ణయించారు. సర్వసభ్య మండలి సమావేశానికి సుమారు 2500 మంది హాజరవుతారని భావిస్తున్నారు. ప్రతి జిల్లా నుండి ఓ మహిళా నేతను ప్రత్యేక ఆహ్వానితురా లిగా పిలవాలని చర్యలు చేపడుతున్నారు. ఇక సమావేశానికి వచ్చే సర్వసభ్య మండలి సభ్యు లందరికీ డిజిటల్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు పార్టీ ప్రధాన కార్య దర్శి బుస్సీ ఆనంద్ గత మూడు రోజులుగా సభ్యులకు డిజిటల్ గుర్తింపు కార్డులను అందజే స్తున్నారు. సోమవారం ఉదయం నుంచి మంగళ వారం వేకువజాము వరకూ ఈ కార్డుల పంపిణీ కొనసాగింది. సమావేశానికి ఎవరూ సెల్‌ఫోన్ తీసుకురాకూడదనే ఆంక్షలు విధిం చారు. ఇక సర్వసభ్యమండలి సమావేశం ప్రాంగణం వద్ద దుబాయ్‌కు చెందిన బౌన్సల ర్లతో భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నారు. పార్టీ అధ్యక్షుడు విజయ్ వెళ్లేందుకు ప్రత్యేక మార్గాన్ని సిద్ధం చేస్తున్నారు. సర్వసభ్యమం డలి సమావేశం జరుగనుండటంతో ప్రస్తుతం ఆ హాలు పరిసర ప్రాంతాల్లోని గోడలపై విజయ్, బుస్సీ ఆనంద్ బొమ్మలతో, సర్వస భ్యమండలి సమావేశానికి రానున్న జిల్లా కార్యదర్శులను ఆహ్వా నిస్తూ బ్యానర్లను కూడా కడుతున్నారు. సర్వసభ్యమండలికి ఇక రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో పార్టీ శ్రేణులతో కలిసి ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ చివరి దశ ఏర్పాట్లపై దృష్టిసారిస్తున్నారు.

మేలో స్థానిక సంస్థలకు ఉప ఎన్నికలు
● రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడి
6

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:29 (గురువారం ఉదయం)

‘ఆంధ్రజ్యోతి’ పాఠకులకు బహుమతుల బొనాంజా



మొదటి బహుమతి కూపన్ తీస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

మొదటి బహుమతి (మోటారు సైకిల్)
డి.వత్సల, 19-7-104, ఎ, గోపాలరాజు కాలనీ, తిరుపతి

ద్వితీయ బహుమతి (రిఫ్రిజిరేటర్)
నగేష్ మరుదాడ, 18-1-26/బి6, భారతీ నిలయం, కపిలతీర్థం రోడ్డు, తిరుపతి

తృతీయ బహుమతి (టీవీ)
టి.కె.శశిధర్, 3-56, పాతపేట, నెహ్రూనగర్, పలమనేరు

● కూపన్లు తీసి విజేతలను ఎంపిక చేసిన ముఖ్య అతిథులు



రెండు, మూడు బహుమతుల కూపన్లను తీస్తున్న ‘వేము’ ఇంజనీరింగ్ కళాశాల అధినేత చంద్రశేఖర్ నాయుడు.. డాక్టర్ వెంకటరమణ

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి పాఠకులకు కార్ అండ్ బైక్ రేసు పోటీకి సంబంధించి మంగళవారం లక్కీ డ్రా జరిగింది. గతేడాది నవం బరు ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ నడుమ నెలకు మూడు చొప్పున మొత్తం 12 కూప న్లను నాలుగు సెట్లుగా వేలాది మంది పాఠకులు ఎడి షన్ కార్యాలయానికి పంపారు. వీటిని మంగళవారం సాయంత్రం రేణిగుంట మండలం దామినేడు సమీ పంలోని ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయంలో ఈ కూపన్లను డ్రా తీశారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ‘వేము’ ఇంజనీరింగ్ కళాశాల అధినేత చంద్రశేఖర్ నాయుడు, తిరుపతికి చెందిన వెంకటరమణ గుండె, మెటర్నటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ వెంకట రమణ.. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కూపన్లు తీసి విజేతలను ప్రకటించారు. అనంతరం ముఖ్య అతిథులు ఆయా విజేతలకు ఫోన్లు చేసి బహుమతులు గెలుచుకున్న విషయం తెలియజేసి శుభాకాంక్షలు చెప్పారు. వీరికి త్వరలో ఎడిషన్ కార్యాలయంలో సంబంధిత బహుమతులను అందజేయను న్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్. ఎం.ఉమామహేశ్వరరావు, తిరుపతి బ్రాంచి మేనేజర్ సురేష్‌రెడ్డి, ఎడిషన్ ఇన్‌ఛార్జి సుధాకరబాబు, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి ఉమాపతి, ఏడీవీటీ ఇన్‌ఛార్జి ఈశ్వరనాయుడు, ప్రొడక్షన్ ఇన్‌ఛార్జి మోహన్‌రావు, బ్యూరో ఇన్‌ఛార్జి శివప్రసాద్, కార్యాలయ సిబ్బంది, పలువురు పలువురు ఆంధ్రజ్యోతి పాఠకులు పాల్గొన్నారు.

కన్సొలేషన్ బహుమతుల వివరాలు 8లో

అమిత్ షాతో ఈపీఎస్ భేటీ

● ఆకస్మికంగా ఢిల్లీ వెళ్లిన ఎడప్పాడి



కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడ ప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) మంగళవారం రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్ని కల్లో ఏయే పార్టీలతో పొత్తు కుదుర్చుకో వాలన్న విషయమై బీజేపీ సహా జాతీయ పార్టీలతో రహస్యంగా మంతనాలు జరి పేందుకే ఆయన ఢిల్లీ వెళ్లారనే రాజకీయ వర్గాల ఊహలను నిజం చేస్తూ హఠాత్తుగా ఢిల్లీ వెళ్లిన ఎడప్పాడి పళనిస్వామి కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసారు.

చడీచప్పుడూ లేకుండా ప్రయాణం...

ఈపీఎస్ ఢిల్లీకి బయలుదేరినప్పుడల్లా పార్టీ శ్రేణులు విమానాశ్రయం వద్ద ఆయనకు వీడ్కోలు చెప్పటం ఆనవాయితీ. అదే విధంగా ఆయన ఢిల్లీ నుండి తిరిగొచ్చినప్పుడు కూడా పార్టీ శ్రేణులు స్వాగతం పలుకుతాయి. ఇవేవీ లేకుండా మంగళ వారం ఉదయం 11.30 గంటలకు విమానంలో ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు. కాసేపటి తర్వాత మాజీ మంత్రి వేలుమణి కూడా ఢిల్లీకి పయనమ య్యారు. ఈపీఎస్ ఢిల్లీ పయనం గురించి గంట ముందుగా పాత్రికేయులకు సమాచారం అందటం ఆనవాయితీ. అయితే ఈ సారి మీడియాకు ఎటు వంటి సమాచారం ఇవ్వకుండానే ఆయన బయలుదే రారు. కాగా స్టాలిన్ అసెంబ్లీలో ఈపీఎస్ ఢిల్లీ ఆక స్మిక ప్రయాణం గురించి ప్రస్తావిస్తూ హస్తినలో ఎవ రెవరిని కలుసుకోబోతున్నారనే విషయం తమకు ముందుగానే తెలిసిందని, ఆ నేతలను కలిసి చర్చలు జరిపేటప్పుడు రాష్ట్రంలో ద్విభాషా విద్యా విధానాన్నే కొనసాగించమంటూ ఒత్తిడి చేయాలని కోరారు. లోక్ సభ ఎన్నికల తర్వాత బీజేపీ, అన్నాడీఎంకే మధ్య విబే ధాలు తారస్థాయికి చేరుకున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్య క్షుడు అన్నామలై అన్నాడీఎంకే మద్దతు లేకుండానే అధికారంలోకి వస్తామని, డీఎంకే అవినీతి పాలనపై విచారణ జరిపి ఆ పార్టీ నేతలను జైలుకు పంపుతా మంటూ ప్రతి సభలోనూ ప్రకటించడం ఆనవాయి తీగా పెట్టుకున్నారు. బీజేపీలోని సీనియర్ నేతలు కొందరు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకుంటేనే మంచిదని, లేకుంటే పార్టీకి అధోగతే నని ఆయనకు నచ్చచెప్పేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కాగా సుప్రీం కోర్టులో రెండాకుల గుర్తు కేసు జరుగుతుండటంతో ఆ కేసు గురించి సీనియర్ న్యాయవాదులతో చర్చించేందుకే ఈపీఎస్ ఢిల్లీ వెళ్ళా రని మరికొంతమంది చెబుతున్నారు. ఏది ఏమైనప్ప టికీ ఈపీఎస్ ఆకస్మిక ఢిల్లీ పయనం టాక్ ఆఫ్ ది సిటీగా మారగా, అందరి ఊహలను పటాపంచలు చేస్తూ ఢిల్లీలోని బీజేపీ పెద్దలను మాజీ సీఎం ఎడ ప్పాడి పళనిస్వామి కలవడంతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త కూటమికి నాంది పలకనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



ఢిల్లీలో ఎడప్పాడికి స్వాగతం పలుకుతున్న ఎంపీలు సీవీ షణ్ముగం, తంబిదురై తదితరులు

మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్, నటుడు షిహాన్ హుసైనీ మృతి

అడయార్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మార్షల్ ఆర్ట్స్, ఆర్చరీ ట్రైనర్, సినీ నటుడు షిహాన్ హుసైనీ (60) మృతి చెందారు. గత కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధప డుతున్న ఆయన ఆయన మంగళవారం శ్రీరామచంద్ర మెడి కల్ యూనివర్శిటీ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. భౌతికకా యాన్ని బీసెంట్ నగర్‌లో ని ఆయన స్వగృహంలో అభిమా నులు, సినీ ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు. మార్షల్ ఆర్ట్స్ మాస్టర్‌గా వందలాది మందికి శిక్షణ ఇచ్చిన హుసైనీ... కోలీవుడ్ అగ్రహీరో విజయ్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చిన గురువు కావడం గమ నార్హం. ఒకవైపు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తూనే మరోవైపు సిని మాల్లో నటించారు. అగ్రహీరో విజయ్ నటించిన ‘బద్రి’ సినిమా ద్వారా వెండితెరకు పరిచయమైన ఆయన... పలు వురు హీరోలకు శిక్షణ ఇచ్చారు. గత కొంతకాలంగా బ్లడ్ క్యాన్స ర్‌కు ఆయన చికిత్స తీసుకున్నారు. ఆయన వైద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా తమిళనాడు క్రీడాభివృద్ధి సంస్థ నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయం కూడా చేసింది. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం వేకువజామున 1.45 గంటల సమయంలో తుది శ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఇదిలా వుండగా హుసైనీ మృతిపట్ల పలువురు సినీ ప్రముఖు లతో పాటు ఏపీ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా తన ప్రగాఢ సంతాపాన్ని, సాను భూతిని వ్యక్తం చేశారు.

అమ్మ వీరభక్తుడిగా...

దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత వీర భక్తుడైన ఆయన.. ఆమె మెప్పుపొందాలనే లక్ష్యంతో తన చేతులపై 101 కార్లు ఎక్కించుకుని, ఆ రక్తంతో జయలలిత చిత్రపటాన్ని గీశారు. ఈ విషయం తెలుసుకున్న జయలలిత అతడిని ఇంటికి పిలిపించి.. సున్నితంగా మందలించారు. అదేవిధంగా జయలలిత జైలుకు వెళ్ళిన సమయంలో కూడా ఆమె విడుదల కావాలంటూ తనకు తానుగా శిలువలో వేలాడి ప్రార్థించారు. అదేవిధంగా జయలలిత విగ్రహం కోసం తన శరీరం నుంచి 24 బాటిళ్ళ రక్తాన్ని సేకరించి భద్రపరిచారు. ఆయనతో పాటు విలువిద్య క్రీడాకారులు కూడా 32 మంది రక్తాన్ని దానం చేశారు. ఈ రకంగా ఎన్నో సాహసాలకు పెట్టింది పేరుగా నిలి చిన హుసైనీ అరుదైన బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ మరణిం చడంపై ఆయన శిష్యులు, కరాటే క్రీడాకారులు, పలురాజకీయ పార్టీల నేతలు, సినీ ప్రముఖులు తదితరుల తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.



షిహాన్ హుసైనీ భౌతికకాయం

సమాచార దృష్టి

28న రైతుల గ్రీవెన్స్

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 28వ తేది రైతుల గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన రైతులు పాల్గొని, తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని కలెక్టర్ సూచించారు.

నేటినుంచి బిర్లా ప్లానిటోరియంలో సైన్స్ ఫెస్టివల్

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా శాఖ ఆధ్వర్యంలోని 'సైన్స్ సిటీ' ఆధ్వర్యంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు కోట్టూరుపురంలోని బిర్లా ప్లానిటోరియంలో సైన్స్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. అన్నా విశ్వవిద్యాలయం, మద్రాసు విశ్వవిద్యాలయం, తమిళనాడు సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్, ఇందిరా గాంధీ సెంటర్ ఫర్ అటామిక్ ఎనర్జీ రీసెర్చ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఫెస్టివల్‌లో... సైన్స్ ఫెయిర్, కొత్త ప్రాజెక్టుల ప్రదర్శన, సెమినార్లు తదితరాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

29న శనిపెయర్చి లేదు : తిరునల్లారు దేవస్థానం

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29వ తేది శనిపెయర్చి ఉండదని తిరునల్లారు దేవస్థానం వివరించింది. మార్చి 29న శనిగ్రహ సంచారం జరుగుతుందని సామాజిక మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. ఈ విషయమై తిరునల్లారు దేవస్థానం విడుదల చేసిన ప్రకటనలో.. తిరునల్లారు శనీశ్వరుడి ఆలయంలో వాక్య పంచాంగ విధానం అనుసరిస్తున్నట్లు స్పష్టం చేశారు. సాంప్రదాయ అంచనా పద్ధతి ప్రకారం, శని సంచారం 2026 సంవత్సరంలో మాత్రమే జరుగుతుందని దేవస్థానం తెలియజేసింది.

నిమిషాల్లోనే ఐపీఎల్ టిక్కెట్లు 'సోల్డ్ ఔట్'

వాషర్‌మెన్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ పోటీల్లో ఈ నెల 28న చేపాక్కం మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్-రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయాలు మంగళవారం ఉదయం 10.15 గంటలకు ఆన్‌లైన్‌లో ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్ విక్రయాలు ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే అన్ని టిక్కెట్లు 'సోల్డ్ ఔట్' అయినట్లు మెసేజ్ రావడంతో, టిక్కెట్లు లభించని అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

1 నుంచి భవన నిర్మాణాల అనుమతికి కొత్త విధానం

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో భవన నిర్మాణాలకు అనుమతి పొందేందుకు, ప్రాజెక్ట్ విలువకనుగుణంగా లక్షల రూపాయలు కమీషన్ తీసుకుంటున్నారని, కమీషన్ ఇవ్వని దరఖాస్తులు బుట్టదాఖలవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ అవినీతిని నివారించేలా కార్పొరేషన్‌కు బదులుగా తమిళనాడు ప్రభుత్వ సింగిల్ విండో పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు కల్పించారు. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... ఏప్రిల్ 1వ తేది నుంచి కార్పొరేషన్ పరిధిలో భవన నిర్మాణాలకు అనుమతుల దరఖాస్తులు onlineppa.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలి. అంతకు ముందు ఈ నెల 31వ తేది వరకు పాత విధానంలోనే దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని జీసీసీ తెలయజేసింది.


బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పంచాగం ఆవిష్కరణ



పంచాంగం ఆవిష్కరణలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేలూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వావసు సంవత్సర తమిళ పంచాగం ఆవిష్కరణ మంగళవారం సత్తువాచేరిలో జరిగింది. కార్యక్రమానికి సంఘ వేలూరు శాఖ అధ్యక్షుడు రాజ అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్ పంచాంగం ఆవిష్కరించి రాజాకు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నిర్వాహకులు కృష్ణమూర్తి, సుగంధి, లలిత, నిర్మల, వెంకటమణి, గణపతి సహా పలువురు పాల్గొన్నారు.

ఎస్డీపీఐ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ముస్లింలు

వేలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం ఎస్డీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.తాజుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఇఫ్తార్ విందు జరిగింది. కార్యక్రమంలో జిల్లా కార్యకర్తల కమిటీ సభ్యుడు అల్తాఫ్ అహ్మద్, వేలూరు వెస్ట్ జిల్లా అధ్యక్షుడు ముక్తార్ అహ్మద్, జిల్లా కార్యకర్తల కమిటీ సభ్యులు జాఫర్‌ఖాన్, బయాస్ అహ్మద్, ముఖ్యఅతిథిగా మద్రాసు హైకోర్టు న్యాయవాది రాజ మహ్మద్, అన్నాడీఎంకే యూనియన్ సెక్రటరీ శివ, వన్‌రాజు, సెక్రటరీ అన్వర్ భాషా, డీపీఐ జిల్లా సెక్రటరీ సుధాకర్, చెల్లపాండ్యన్, తమిళనాడు ముస్లిం జమాత్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కలందర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

● కొడనాడు హత్య, దోపిడీ కేసు..

జయ మాజీ దత్తపుత్రుడికి సీబీసీఐడీ సమన్లు

టినగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జయలలిత వేసవి విడిదికేంద్రమైన కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన వాచ్‌మెన్ హత్య, దోపిడీ సంఘటనలపై విచారణ జరుపుతున్న సీబీసీఐడీ పోలీసులు ఆమె మాజీ దత్తపుత్రుడు సుధాకరన్‌కు సమన్ జారీ చేశారు. ఈ నెల 27న విచారణకు హాజరుకావాలని ఆ సమన్ పంపించారు. సుధాకరన్ కొడనాడు ఎస్టేట్ భాగస్వామిగా వ్యవహరించిన కారణంగా ఆయనకు ఈ సమన్లు పంపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సీబీసీఐడీ పోలీసులు సుమారు 250 మంది సాక్షుల వద్ద విచారణ జరిపారు. తాజాగా సుధాకరన్ వద్ద విచారణ జరిపేందుకు సన్నద్ధమవుతున్నారు.

సీలు వేసిన ఆశ్రమంలో చొరబడిన నిత్యానంద శిష్యుల అరెస్టు

టి.నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వు మేరకు రెవెన్యూ అధికారులు వేసిన సీళ్లను పగులగొట్టి ఆశ్రమాల్లో చొరబడిన నిత్యానంద శిష్యులను పోలీసులు అరెస్టు చేశారు. విరుదునగర్ జిల్లా రాజపాళయం కోదైనాచ్చియార్‌పురం, సేత్తూరు ప్రాంతాల్లో వివాదాస్పద స్వామి నిత్యానంద ధ్యానపీఠానికి చెందిన రెండు ఆశ్రమాలున్నాయి. నిత్యానంద దేశం విడిచివెళ్ళినా ఆయన శిష్యులు ఈ ఆశ్రమాల్లో రోజు ధ్యానం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిత్యానందపై అంతర్జాతీయ స్థాయిలో కేసులు నమోదవుతుండటంతో 18 యేళ్ల క్రితం ఆ స్థలాలను దానంగా ఇచ్చిన రాజపాళయం ప్రాంతానికి చెందిన డాక్టర్ గణేషన్ తమ దాన పత్రాలను రద్దు చేయాలని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ఆ రెండు ఆశ్రమాలను నిత్యానంద శిష్యులుగాని, స్థలదాతలు గాని ఉపయోగించకూడదంటూ స్టే విధించారు. దీనితో తహసీల్దార్ రామసుబ్రమణియన్, ఇతర అధికారులు ఇటీవల ఆ రెండు ఆశ్రమాల్లో ఉంటున్న వారిని బయటకు పంపించి సీలు వేశారు.. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఆ ఆశ్రమంలో ఉండే మహిళలు అధికారులు వేసిన సీళ్లను తొలగించి ఎప్పటివలెనే భజనలు, ధ్యానం చేయడం ప్రారంభించారు. ఈ విషయంపై రెవెన్యూ శాఖ ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు రాజపాళయం సౌత్, సేత్తూరు స్టేషన్లకు చెందిన పోలీసులు కేసులు నమోదు చేసి ఆ రెండు ఆశ్రమాలకు వెళ్ళారు. ఆ తర్వాత ఆశ్రమాల్లో ఉంటున్న నిత్యానంద శిష్యులు ఏడుగురిని అరెస్టు చేశారు.



శిష్యులను అరెస్టు చేస్తున్న మహిళా పోలీసులు

అమెరికన్లు ఆవిన్ నెయ్యి ఇష్టపడుతున్నారు

● మంత్రి రాజకన్నప్పన్

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆవిన్ నెయ్యిని అమెరికన్లు ఇష్టపడుతున్నారని మంత్రి రాజకన్నప్పన్ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో అన్నాడీఎంకే సభ్యుడు దళవాయ్ సుందరం మాట్లాడుతూ.... గ్రామాల నుంచి ఆవిన్ సంస్థ పాలు కొనుగోలు చేస్తోందని, కానీ ఆవిన్ వస్తువులు గ్రామాల్లో లభించడం లేదన్నారు. సొసైటీల ద్వారా ఆవిన్ ఉత్పత్తులు గ్రామాల్లో విక్రయించేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి మంత్రి రాజకన్నప్పన్ బదులిస్తూ... రాష్ట్రవ్యాప్తంగా 300 సహకార సంఘాలున్నాయని, వాటి ద్వారా ఆవిన్ ఉత్పత్తులు విక్రయించేలా చర్యలు చేపడతామన్నారు. ఆవిన్ నెయ్యి నాణ్యతగా ఉండడంతో అమెరికా దేశ ప్రజలు కూడా ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారని మంత్రి తెలిపారు.

సెప్టెంబరు 15న కచ్చాదీవి కేసు విచారణ

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవు కేసు విచారణ సెప్టెంబరు 15న చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. భారత్-శ్రీలంక దేశాల మధ్య 1974, 1976లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కచ్చాదీవు శ్రీలంక వశమైందని, ఈ ఒప్పందం రద్దు చేయాలని కోరుతూ 2008లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి జయలలిత, ఏకే సెల్వరాజ్ వేర్వేరు పిటిషన్లు వేశారు. ఈ కేసు విచారించిన సుప్రీంకోర్టు, అఫిడవిట్ దాఖలుచేయాలని 2009లో కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీచేసింది. కేసు విచారణ జాప్యం కావడంతో, కేసు సత్వరం విచారించాలని 2012 సెప్టెంబరు 12న జయలలిత మరో పిటిషన్ వేశారు. అలాగే, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తరఫున కూడా మరో పిటిషన్ దాఖలైంది. 2020లో జరిగిన విచారణ అనంతరం మళ్లీ సోమవారం ఈ కేసు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ సమయంలో పిటిషనర్ సెల్వరాజ్ తరఫున, తమ న్యాయవాది మృతిచెందిన నేపథ్యంలో, వకాల్తా దాఖలుకు అవకాశం కల్పించాలని కోరారు. అలాగే, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తరఫున హాజరైన న్యాయవాది విల్సన్... ఈ కేసు దాఖలుచేసిన పిటిషనర్ మృతి చెందిన కారణంగా కొత్త పిటిషన్ దాఖలుచేయనున్నామని, ఈ కేసులో పిటిషనర్‌గా డీఎంకే కోశాధికారి టీఆర్ బాలును చేర్చేందుకు అనుమతించాలని కోరారు. అనంతరం టీఆర్ బాలును పిటిషనర్‌గా అంగీకరించిన ధర్మాసనం, తదుపరి విచారణ సెప్టెంబరు 15వ తేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

సీనియర్‌పై దాడి వ్యవహారం

ఆరుగురు విద్యార్థుల అరెస్ట్

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో సీనియర్ విద్యార్థిపై దాడిచేసిన వ్యవహారంలో ఆరుగురు విద్యార్థులకు పోలీసులు అరెస్ట్ చేశారు. మధుక్కరై ప్రాంతంలోని ఓ కళాశాల హాస్టల్ జూనియర్ విద్యార్థికి చెందిన నగదు కనిపించలేదు. ఈ నగదు సీనియర్ విద్యార్థి దొంగిలించాడంటూ, 13 మంది జూనియర్లు అతడిపై దాడిచేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడ్డాయి. ఈ వ్యవహారంలో 13 మంది జూనియర్ విద్యార్థులను కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆరుగురు విద్యార్థులకు అరెస్ట్ చేశారు. వారిలో ముగ్గురు 18 ఏళ్లలోపు వారు కావడంతో వారిని జువైనల్ హోంకు, మిగిలిన వారికి జైలు తరలించిన పోలీసులు, మరో ఏడుగురి కోసం గాలిస్తున్నారు.

ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించండి

● అసెంబ్లీలో ఉదయ్‌కుమార్ డిమాండ్



ప్రతిపక్ష ఉపనేత ఆర్బీ ఉదయ్‌కుమార్

ప్యారీస్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించాలని ప్రతిపక్ష ఉపనేత ఆర్బీ ఉదయ్‌కుమార్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం అసెంబ్లీలో నీటివనరుల శాఖ అనుబంధ పద్దులపై చర్చ జరిగింది.. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన రోజు నుండి ప్రతిరోజు కనీస వసతుల కల్పన కోసం రాష్ట్రప్రజలు చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలను డీఎంకే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఉదయకుమార్ విమర్శించారు. మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవం జరుపుకున్న రాష్ట్రప్రభుత్వం నీటి పన్ను చెల్లిస్తున్న రాష్ట్రప్రజలకు శుభ్రమైన మంచినీటిని పంపిణీ చేయడంలేదని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీఎంకే విడుదల చేసిన మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.10వేల కోట్లతో నీరువనరులను పునరుద్ధరింపజేస్తామన్న హామీ ఏమైందో ప్రజలకు సమాధానం చెప్పాలని ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

బస్సు వెనుక విద్యార్థిని పరుగులు

●డ్రైవర్ సస్పెన్షన్



బస్సు వెనుక పరుగులు తీస్తున్న విద్యార్థిని

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆగకుండా వెళ్లిన ప్రభుత్వ బస్సు వెనుక ప్లస్ టూ విద్యార్థిని పరుగులు తీస్తూ వెళ్లిన దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి బస్టాండ్ నుంచి మంగళవారం ఉదయం ఆలంగాయం వైపుకు ప్రభుత్వ బస్సు బయల్దేరింది. ఆ బస్సు కొత్తకోట బస్టాండ్ సమీపిస్తుండగా, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు వెళ్తున్న ప్లస్ టూ విద్యార్థిని బస్సు ఆపాలంటూ చేతులు ఊపింది. కానీ, డ్రైవర్ బస్సు ఆపకుండా ముందుకు వెళ్లడంతో, దిగ్భ్రాంతికి గురైన విద్యార్థిని పరీక్షకు సకాలంలో హాజరుకాలేను అనే భయంతో బస్సు వెనుక పరుగులు తీసింది. కొద్ది దూరం వెళ్లిన తర్వాత డ్రైవర్ బస్సును ఆపడంతో, సదరు విద్యార్థిని బస్సు ఎక్కింది. విద్యార్థిని బస్సు వెనుక వేగంగా పరుగులు తీస్తున్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వెలువడింది. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (విల్లుపురం రీజియన్) మేనేజింగ్ డైరెక్టర్, పరీక్ష రాసేందుకు పాఠశాలకు వెళ్లేందుకు వేచి ఉన్న విద్యార్థిని బస్సులో ఎక్కించుకోని కారణంగా డ్రైవర్ మునిరాజ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పేద ప్రజలకు నిత్యాన్నదానం



అన్నదానం చేస్తున్న దినేష్ శరవణన్

వేలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్తువాచేరిలోని రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి, సమాజ సేవకుడు దినేష్ శరవణన్, నేసనిధి ట్రస్ట్ సంయుక్తంగా తిరువణ్ణామలై జిల్లా జువ్వాది కొండ ప్రాంతాల్లోని కొల్లై, వెంట్ట లావ్ ం పట్టు, మాటుకన్న తదితర గ్రామాలకు చెందిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు మంగళవారం మధ్యాహ్నం ఉచిత భోజనం అందించే కార్యక్రమం ప్రారంభించారు. ప్రతిరోజు 100 నుంచి 150 మందికి అన్నదానం చేయనున్నట్లు దినేష్ శరవణన్ తెలిపారు.

● ఐపీఎల్ ఎఫెక్ట్...

పెరిగిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు ఎండలు... మరో వైపు ఐపీఎల్ క్రికెట్ పోటీలతో విద్యుత్ వినియోగం 200-250 మెగావాట్లకు పెరిగింది. రాష్ట్రంలో సరాసరి విద్యుత్ వినియోగం 16వేల మెగావాట్లు కాగా, వేసవిలో వినియోగం 20వేల మెగావాట్లకు చేరుకుంటుంది. గత నెల చివరి వారం నుంచే ఎండలు ఎక్కువవడంతో ఏసీల వినియోగం పెరిగింది. అలాగే, పబ్లిక్, వార్షిక పరీక్షలు జరుగుతుండడంతో రాత్రి వేళ విద్యుత్ వినియోగంకూడా ఎక్కువైంది. ఈ నేపథ్యంలో, ఐపీఎల్ పోటీలు ప్రారంభం కావడంతో క్రికెట్ మ్యాచ్‌ల కారణంగా వినియోగం పెరిగింది. ఈ నెల 23వ తేది ఆదివారం రెండు మ్యాచ్‌లుండడంతో విద్యుత్ వినియోగం 17,074కు పెరిగింది. అదే సమయంలో గత ఆదివారం (ఈ నెల 16వ తేది) విద్యుత్ వినియోగం 14,981 మెగావాట్లుగా ఉందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

మేలో స్థానిక సంస్థలకు ఉప ఎన్నికలు

● రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడి

ప్యారీస్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 9 జిల్లాల్లో స్థానిక సంస్థల్లో ఖాళీ అయిన 315 స్థానాలకు మే నెలలో ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపాలిటీ పట్టణ పంచాయతీ, గ్రామీణ పంచాయతీల పదవీ కాలం 2027 నాటికి పూర్తికానుంది. అందువల్ల పట్టణ పంచాయతీల్లో ఖాళీ పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించి ఆ స్థానాలను భర్తీ చేయాల్సిన అవసరం ఎన్నికల కమిషన్‌కు ఏర్పడింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో ఖాళీగావున్న 315 స్థానాలకు మే నెలలో ఉప ఎన్నిక జరపాలని ఎన్నికల కమిషన్ సన్నాహాలు చేస్తోంది.. ఈ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవల్సిందిగా ఆయా జిల్లాల ఎన్నికల ప్రధాన అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది.. కాగా, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్లలో 4 వార్డుల కౌన్సిలర్లు సహా 35 జిల్లాల్లో కౌన్సిలర్ పదవులు ఖాళీగావుండటం గమనార్హం.

పశువుల సంతలో ఒకేరోజు రూ.5 కోట్ల విక్రయాలు

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా పొల్లాచ్చి పశువుల సంతలో ఒకే రోజు రూ.5 కోట్ల మేర విక్రయాలు జరిగాయి. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు మంగళవారం జరిగిన సంతలో పశువులు కొనుగోలు చేశారు. ఈ సంతలో సాధారణంగా రూ.2 కోట్ల మేర విక్రయాలు జరుగుతున్న నేపథ్యంలో, రంజాన్ సందర్భంగా రూ.5 కోట్ల మేర విక్రయాలు జరుగడంతో రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి పొగలు

వాషర్‌మెన్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కం రైల్వేస్టేషన్ మీదుగా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ బోగీ కింద పొగలు రావడం కలకలం రేపింది. చెన్నై ఎగ్మూర్ నుంచి కన్నియాకుమారికి మంగళవారం ఎక్స్‌ప్రెస్ బయల్దేరింది. నుంగంబాక్కం రైల్వేస్టేషన్‌కు చేరుకున్న సమయంలో 'ఎస్ 5' బోగీ కింది భాగంలో పొగలు రావడాన్ని గుర్తించిన ప్రయాణికులు ఎమర్జెన్సీ చైన్ లాగి రైలు నిలిపివేశారు. అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని మరమ్మతులు చేపట్టడంతో 12 నిజటుషాలు ఆలస్యంగా రైలు బయల్దేరి వెళ్లింది. బోగీ కింద భాగంలోని బ్రేక్ రాపిడితో పొగలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పుదియ భారతం ఆధ్వర్యంలో సహాయాల పంపిణీ



కార్మికులకు సహాయాలు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి తాలూకా పుదూర్‌లోని గంగై అమ్మన్ ఆలయ ప్రాంగణంలో పుదియ భారతం పార్టీ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులకు సహాయాలు పంపిణీ జరిగింది. కార్యక్రమానికి కార్మిక సంఘం అధ్యక్షుడు వేల్‌మురుగన్ పాల్గొని, కార్మికులకు సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో సమాజ సేవకుడు అశోక్‌కుమార్, పార్టీ జిల్లా సెక్రటరీ రోజ్, ప్రాంత ఆర్గనైజర్లు రెజీనా, సత్య, పింఛన్‌దారుల సంఘం ఆర్గనైజర్ అరుణగిరి, రాష్ట్ర సెక్రటరీ కయల్‌విళి, కోశాధికారి సెల్వి గీతా తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా తాగునీటి కనెక్షన్లు

వాషర్‌మెన్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కనెక్షన్ల ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని మదురై కార్పొరేషన్ ప్రకటించింది. ఈ మేరకు కార్పొరేషన్ విడుదల చేసిన ప్రకటనలో... 'అమృత్' పథకంలో తాగునీటి కనెక్షన్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపింది. కనెక్షన్ తర్వాత వినియోగించే నీటి పరిమాణం ఆధారంగా రుసుము వసూలుచేయనున్నట్లు కార్పొరేషన్ తెలిపింది.

బాలుడి హత్యకేసులో మహిళకు రెండు యావజ్జీవ కారాగార శిక్షలు

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలుడిని హతమార్చిన కేసులో ఓ మహిళకు కోర్టు రెండు యావజ్జీవశిక్షలు విధించింది. కడలూరు జిల్లా బన్రూటి సమీపం కీలకొల్లైకామన్ గ్రామానికి చెందిన సెంథిల్‌నాథన్-లక్ష్మి దంపతుల నాలుగేళ్ల కుమారుడు అశ్వంత్ 2022 జనవరి 26న కనిపించకుండా పోయాడు. సెంథిల్‌నాథన్ ఫిర్యాదు మేరకు ముత్తాండికుప్పం పోలీసులు కేసు నమోదుచేసి బాలుడి కోసం గాలించారు. గ్రామ శివారులోని జీడితోటలో అశ్వంత్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసుల విచారణలో, సెంథిల్‌నాథన్-మురుగవేల్ మధ్య ఉన్న స్థలం వివాదం కారణంగా మురుగవేల్ కుమార్తె రంజిత (26), అశ్వంత్‌ను కిడ్నాప్ చేసి గొంతు నులిమి హతమార్చిందని పోలీసుల విచారణలో తేలడంతో రంజితను అరెస్ట్ చేశారు. ఈ కేసులో వాదోపవాదాలు పూర్తికావడంతో నిందితురాలు రంజితకు రెండు యావజ్జీవశిక్షలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శోభనాదేవి సోమవారం తీర్పు వెలువరించారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు వృద్ధుడు మృతిచెందిన ఘటన శివగంగ జిల్లాలో చోటుచేసుకుంది. దేవకోటలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సిత్తానూరు ప్రాంతం నుంచి 65 ఏళ్ల వృద్ధుడు సైకిల్‌పై వస్తున్నాడు. ఆ సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలోని చెట్టు కింద సేదతీరాడు. ఎండ తీవ్రత కారణంగా కళ్లు తిరుగుతున్నాయని ఆ వృద్ధుడు పక్కనున్న వారికి చెప్పినట్లు సమాచారం. అంతలోనే సదరు వృద్ధుడు స్పృహతప్పి కింద పడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న దేవకోట తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవకోట ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హెరాయిన్‌తో ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభిరామపురంలో మూడు గ్రాముల హెరాయిన్ కలిగిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. అభిరామపురం దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ రోడ్డు శివాజీ మణిమండపం సమీపంలో సోమవారం గస్తీ చేపట్టిన అభిరామపురం పోలీసులు, అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని విచారించారు. తరమణి శ్రీరామ్‌నగర్ 1వ వీధికి చెందిన సోహక్‌ప్రియ, కారపాక్కం కందస్వామి వీధికి చెందిన అబ్దుల్ మియాగా గుర్తించి, వారి నుంచి మూడు గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. త్రిపుర రాష్ట్రానికి చెందిన వీరు నగరంలో నివశిస్తూ, హౌస్ కీపింగ్ పనులు చేస్తుంటారని, పొరుగు రాష్ట్రాల నుంచి మాదకద్రవ్యాలు తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తుంటారని తేలడంతో, వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు నగర పోలీసు శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

కూమార్తెపై అఘాయిత్యం కేసులో కీచక తండ్రికి జీవిత ఖైదు

తిరుత్తణి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కన్న కూతురిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో మహిళా న్యాయస్థానం నిందితుడికి జీవిత ఖైదు విధించింది. తిరువళ్లూరు జిల్లా పొదటూర్‌పేటలో ఐదేళ్ళ క్రితం కూలీ పనిచేసుకునే వ్యక్తి (37)ఇంట్లో ఎవరులేని సమయంలో తన 12 ఏళ్ళ కూతురిపైనే అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న అతడి భార్య స్థానిక మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ ఐదేళ్ళ తర్వాత మహిళా కోర్టుకు రాగా అత్యాచారానికి పాల్పడ్డ కామాంధపు తండ్రికి జీవిత ఖైదు, రూ. లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సరస్వతి తీర్పు చెప్పారు.

● తిరునల్వేలి రిటైర్డ్ ఎస్ఐ హత్య కేసు...

మానవ హక్కుల సంఘం విచారణ

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో ఈ నెల 18న మాజీముఖ్యమంత్రి కరుణానిధి భద్రతా విభాగంలో పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన ఎస్ఐ జాకీర్ హుస్సేన్ హత్యకేసును జాతీయ మానవహక్కుల సంఘం స్యూమోటోగా స్వీకరించి విచారణ ప్రారంభించింది. ఈ హత్యకేసుకు సంబంధించిన డీజీపీ, జిల్లా కలెక్టర్ నాలుగు వారాల్లో తమకు నివేదిక సమర్పించాలని ఈ సందర్భంగా ఆదేశించింది. జాకీర్‌హుస్సేన్ హత్యకేసులో పోలీసులు ఇప్పటికే కృష్ణమూర్తి, ఆయన సోదరుడు కార్తీక్, బావమరిది అక్బర్ బాషా, 16 యేళ్ళ బాలుడిని అరెస్టు చేశారు.

ముసుగు దొంగల దాడి

● ఒకరికి తీవ్రగాయాలు

తిరుత్తణి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొదటూర్‌పేటలో దేవరాజ్ (35)అనే వ్యక్తి కోళ్ళ ఫారం నడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో, అతడు సోమవారం రాత్రి సమయంలో రోడ్డుపై నడిచి వెళ్తున్న సమయంలో ముసుగు వేసుకున్న ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు దేవరాజ్‌ను అడ్రస్ అడుగుతున్నట్లుగా వచ్చి, మొబైల్ ఫోన్ దొంగిలించే ప్రయత్నం చేశారు. వారిని ప్రతిఘటించిన దేవరాజ్‌పై దాడిచేసి, కత్తులతో తలపై కొట్టగా అతడు స్పృహకోల్పోయాడు. గమనించిన గ్రామస్థులు వెంటనే అక్కడికి చేరుకోగా, ఆగంతకులు పరారయ్యారు. వెంటనే గ్రామస్థులు దేవరాజ్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలిసి ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు కేసు నమోదుచేసి, దాడికి పాల్పడినవారి కోసం గాలిస్తున్నారు.

పాదయాత్ర భక్తులపైకి దూసుకెళ్లిన వాహనం

● మహిళ మృతి

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులపై వాహనం దూసుకెళ్లిన ఘటనలో ఒక మహిళ మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. కృష్ణగిరి జిల్లా కరువనూరు గ్రామానికి చెందిన 90 మంది భక్తులు పాదయాత్రగా తిరుమలకు బయల్దేరారు. మంగళవారం ఉదయం ఈ బృందం తిరుపత్తూర్ జిల్లా ఆంబూరు సమీపం విన్నమంగళం ప్రాంతంలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో నస్తుండగా వెనుకగా వచ్చిన సరుకు వాహనం భక్తులపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలుకాగా, వారిని వెంటనే ఆంబూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు ఫలించక పుష్ప అనే మహిళ మృతిచెందగా, లక్ష్మి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనలో తప్పించుకొనేందుకు యత్నించిన సరుకు వాహనం డ్రైవర్ సెంగోట్టయన్‌ను స్థానికులు పట్టుకుని ఆంబూరు గ్రామీణం పోలీసులకు అప్పగించారు.

పాలిస్తుండగా ఊపిరాడక పసికందు మృతి

తిరుత్తణి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సాయిబాబానగర్‌కు చెందిన పృథ్విరాజ్, స్వాతి దంపతులకు గత నెల ఓ ఆడశిశువు జన్మించింది. 45 రోజుల ఆడశిశువుకు తల్లి సోమవారం రాత్రి ఒడిలో పడుకోబెట్టుకుని పాలు పట్టింది. ఈ క్రమంలో పాలు తాగుతున్న ఆ శిశువుకు ఊపిరాడకపోవడంతో తల్లి ఒడిలోనే మృతిచెందింది. ఇది గమనించిన తల్లి స్వాతి, వెంటనే భర్తకు తెలిపి, హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు బిడ్డ మృతిచెందిందని నిర్ధారించారు.

కండలేరు డ్యాం నుంచి నీరు విడుదల

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం నుంచి రాష్ట్రానికి జలాలు విడుదల చేశారు. ఆంధ్ర-తమిళనాడు మధ్య జరిగిన నదీజలాల ఒప్పందం ప్రకారం, ఆంధ్ర ప్రభుత్వం రాష్ట్రానికి మొత్తం 15 టీఎంసీలు అందించాల్సి ఉంది. కండలేరు డ్యాంలో 8 టీఎంసీలకు పైగా నీరుంటే మాత్రమే రాష్ట్రానికి నీరు విడుదల చేయాలని ఒప్పందంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, జనవరిలో నీటిని విడుదల చేయకపోవడంతో, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు ఆంధ్ర రాష్ట్ర ప్రజాపనుల శాఖ అధికారులకు లేఖ రాశారు. ఆ ప్రకారం, సోమవారం ఉదయం 11.45 గంటలకు సెకనుకు 500 ఘనపుటడుగుల చొప్పున కండలేరు నుంచి నీటిని విడుదల చేశారు. నీటి విడుదల క్రమక్రమంగా పెంచనున్నట్లు ఆంధ్ర రాష్ట్ర అధికారులు తెలిపారు.

తిరువలంగాడు చెరువులో పడి వ్యక్తి మృతి

తిరుత్తణి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడులోని వడారణ్యేశ్వరాలయ సమీపంలో మంగళవారం ఉదయం చెరువులోపడి గుర్తుతెలియని 52ఏళ్ళ వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్థులు అందించిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ గ్రామంలోని వారిని విచారించగా, మృతిచెందిన ఆ వ్యక్తి ఆ ప్రాంత వాసి కాదని తేలింది. దీనిపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఆ వ్యక్తి చెరువలో జారిపడి మృతిచెందాడా? లేక ఎవరైన హత్య చేసివుంటారా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

'లూసిఫర్'కు కొనసాగింపు..

● ఒక ట్రయాలజీ మూవీ

● మోహన్‌లాల్



మోహన్‌లాల్, మంజూ వారియర్, పృథ్విరాజ్ తదితరులు

'ఎల్2-ఎంపురాన్' మూవీ ఒక ట్రయాలజీ మూవీ అని ఆ చిత్ర హీరో మోహన్‌లాల్ అన్నారు. ఈ చిత్రం తమిళ వెర్షన్ ఆడియో రిలీజ్ నగరంలో జరిగింది. ఇందులో పాల్గొన్న మోహన్‌లాల్ మాట్లాడుతూ, 'ఇది ఒక ట్రయాలజీ మూవీ. ఇంతకుముందు వచ్చిన 'లూసిఫర్', ఇపుడు 'ఎంపురాన్'. తర్వాత మరో చిత్రం రానుంది. ప్రధానంగా మలయాళ చిత్రపరిశ్రమకే అతిముఖ్యమైన చిత్రం. కాస్త కొత్తదనంతో ప్రయత్నం చేశాం. ఇందుకోసం సాంకేతిక నిపుణులు, నటీనటులు ఇలా ప్రతి ఒక్కరూ ఎంతగానో శ్రమించారు. తమిళంలో కూడా మంచి ఆదరణ పొందుతుందని నమ్ముతున్నాం. ఇలాంటి చిత్రాలకు ఆదరణ లభిస్తే అనేక పెద్ద చిత్రాలు వస్తాయి. అందుకోసమైనా ఈ చిత్రం హిట్ కావాలి. ఈ మూవీ కోసం మీలాగే నేను కూడా ఈ నెల 27వ తేదీ కోసం ఎదురు చూస్తున్నాను' అని పేర్కొన్నారు. దర్శకుడు, నటుడు పృథ్విరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ, 'మురళి గోపి స్క్రీన్‌ప్లే అందించగా, భారీ యాక్షన్ మూవీగా తెరకెక్కించాం. లైకా ప్రొడక్షన్స్, ఆశీర్వాద్ సినిమాస్, శ్రీ గోకులం మూవీస్ సంయుక్తంగా నిర్మించాయి. 2019లో వచ్చి ఘన విజయం సాధించిన 'లూసిఫర్'కు సీక్వెల్‌గా భారీ యాక్షన్ సన్నివేశాలతో రూపొందించాం. పాన్ ఇండియా చిత్రంగా 'ఎంపురాన్' విడుదల చేస్తున్నాం' అని వెల్లడించారు. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి పృథ్విరాజ్ సుకుమారన్ దర్శకుడు. మంజూ వారియర్ హీరోయిన్‌గా నటించారు. ఈ మూవీ ఆడియో రిలీజ్ వేడుకలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

చిన్న చిత్రాల విజయానికి కారణం అదే

● హీరో మణికంఠన్



చిన్న చిత్రాలు విజయం సాధించడానికి ప్రేక్షకుల విశాల హృదయమే ప్రధాన కారణమని హీరో మణికంఠన్ అభిప్రాయపడ్డారు. తమిళ చిత్రపరిశ్రమలో 'గుడ్ నైట్', 'లవర్', 'కుడుంబస్తన్' చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలను సొంతం చేసుకున్నారు. ఈ మూడు చిత్రాలు కూడా బిగ్‌స్క్రీన్‌పై 50 రోజుల ప్రదర్శన విజయవంతంగా పూర్తి చేసుకున్నాయి. తాజాగా ఆయన నటించిన 'కుడుంబస్తన్' మూవీ కూడా విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. ఈ నేపథ్యంలో ఆయన తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను నటించిన చిన్న చిత్రాల విజయంపై స్పందించారు. 'చిన్న బడ్జెట్ చిత్రాల సక్సెస్‌కు ప్రేక్షకులు చూపించే ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు చెప్పేందుకు నా వద్ద ఎలాంటి పదాలు లేవు. 'కుడుంబస్తన్' మూవీ ప్రదర్శన థియేటర్లలో విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉంది. ఇది ఒకటి, రెండుసార్లు కాదు. మూడుసార్లు హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్నాను. ఆయా చిత్రాలకు పనిచేసిన సాంకేతిక నిపుణులకు ప్రత్యేక ధన్యవాదాలు. వీరి సహకారం ఎంతో ముఖ్యమైనది. నన్ను ఆదరించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

కార్తి జోడీగా కళ్యాణి?



కళ్యాణి ప్రియదర్శన్

ప్రముఖ హీరోగా కార్తి సరసన కళ్యాణి ప్రియదర్శన్ నటించనున్నారు. నలన్ కుమారస్వామి దర్శకత్వంలో కార్తి హీరోగా రూపొందే చిత్రంలో కథానాయికగా కళ్యాణి ప్రియదర్శన్‌ను ఎంపిక చేసినట్టు మూవీ వర్గాల సమాచారం. ప్రస్తుతం కార్తి... పీఎస్ జవహర్ మిత్రన్ దర్శకత్వంలో 'సర్దార్-2' మూవీలో నటిస్తున్నారు. ఆ తర్వాత 'టాణాక్కారన్' దర్శకుడు తమిళ్ దర్శకత్వంలో ఓ చిత్రం నటించనున్నారు. ఇది కార్తి 29వ చిత్రం. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై నిర్మించే ఈ చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్ ఎంపిక చేసినట్టు సమాచారం. తమిళంలో శివకార్తికేయన్ నటించిన 'హీరో', శింబు నటించిన 'మానాడు' మూవీల్లో నటించిన కళ్యాణి.. తెలుగు, మలయాళం భాషా చిత్రాల్లో నటించారు.

'డ్రాగన్' బృందాన్ని అభినందించిన విజయ్



విజయ్‌తో అశ్వత్ మారిముత్తు

తమిళ చిత్రజ్యోతి

ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన 'డ్రాగన్' చిత్ర బృందాన్ని ప్రముఖ నటుడు విజయ్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రదీప్ రంగనాథన్, అనుపమ పరమేశ్వరన్, కయదు లోహర్ జంటగా నటించిన 'డ్రాగన్' చిత్రం గత నెల 21వ తేదీ విడుదలైంది. అశ్వత్ మారిముత్తు దర్శకుడు. ఏజీఎస్ నిర్మాణ సంస్థ అతి తక్కువ బడ్జెట్‌తో నిర్మించగా రూ.100 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టింది. అలాగే, మూవీని అనేక మంది సినీ ప్రముఖులు చూసి చిత్ర బృందాన్ని అభినందించారు. వీరిలో సూపర్‌స్టార్ రజనీకాంత్ కూడా ఉన్నారు. తాజాగా విజయ్ 'డ్రాగన్' సినిమా చూసి చిత్ర బృందాన్ని పిలిచి అభినందించారు. దీనిపై దర్శకుడు అశ్వత్ మారిముత్తు తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. 'ఏదో ఒక రోజు విజయ్‌ను కలవాలని, ఆయనతో వర్క్ చేయాలని బలమైన సంకల్పం, అకుంఠిత దీక్షతో పనిచేస్తున్నానన్న విషయం నాతో ఉండేవాళ్ళకు బాగా తెలుసు. కానీ, ఇపుడు విజయ్‌ని కలిసి ఆయనకు ఎదురుగా కూర్చున్నాను. నేను విజయ్ వీరాభిమానిని. నా స్నేహితుడు ప్రదీప్ రంగనాథన్‌తో తీసిన సినిమా చూసిన విజయ్.. మంచి కంటెంట్ అని చెప్పడంతో ఈ జీవితానికి ఇది చాలన్న భావన కలిగింది. థ్యాంక్స్ జగదీష్ బ్రో, అర్చన మేడమ్. మీకు ధన్యవాదాలు. ఇది నాకు భారీ గిఫ్ట్' అని పేర్కొన్నారు.



ఎంఎస్ఎంఈ భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

రూ.133.32 కోట్లతో ఎంఎస్ఎంఈ భవనాలు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.133.32 కోట్లతో నిర్మించిన గొలుసుల ఉత్పత్తి ప్రాంగణం, కార్మికుల క్వార్టర్స్ కొత్తగా ఐదు పారిశ్రామికవాడలు, 5 సాధారణ వసతి కేంద్రాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. చెన్నై సచివాలయంలో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల సంస్థలు (ఎంఎస్ఎంఈ) శాఖకు చెందిన రాష్ట్ర చిన్న పరిశ్రమల అభివృద్ధి సంస్థ తరఫున రూ.57.72 కోట్లతో సేలం జిల్లా అరియ గౌండపట్టిలో బహుళ అంతస్థుల వెండి పట్టీల ఉత్పత్తి కేంద్రం భవనాన్ని, కోయంబత్తూరు జిల్లా కురిచ్చి సిడ్కో పారిశ్రామికవాడలో కార్మికుల వసతి గృహం, కాంచీపురం, కడలూరు, తిరువారూరు, సేలం, తూత్తుకుడి జిల్లాల్లో రూ. 40.27 కోట్లతో రూపొందించిన ఐదు పారిశ్రామికవాడలు, సేలం, తూత్తుకుడి, కన్నియాకుమారి, కోయంబత్తూరు, ఈరోడ్ జిల్లాల్లో రూ.35.33 కోట్లతో నిర్మించిన ఐదు సాధారణ వసతి కేంద్రాలను మంగళవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామో అన్బరసన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల సంస్థలు (ఎంఎస్ఎంఈ) శాఖల అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అతుల్ ఆనంద్, రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎ.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ సహకారంతో కొత్త నిఘంటువు...

చెన్నై సచివాలయంలో మంగళవారం ఉదయం రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రచురణ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ విశ్వవిద్యాలయం సహకారంతో రూపొందించిన తమిళ- ఇండో- యూరోపియన్ పదబంధాల తులనాత్మక నిఘంటువును ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రచుణ సంస్థ భారతీయ విభాగం మేనేజింగ్ డైరెక్టర్ సుగంధ దాస్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎంపీ సామినాథన్, పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, రాష్ట్రపాఠ్యపుస్తకాల ప్రచురణ సంస్థ చైర్మన్ దిండుగల్ లియోని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఒప్పిలియప్పన్ మహారథోత్సవం



రథోత్సవంలో భక్తజనం - (ఇన్‌సెట్)లో రథారూఢులైన భూమాదేవి సమేత పొన్నప్పర్ స్వామి

టి.నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఒప్పిలియప్పన్ ఆలయ పంగుణి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహారథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ వేడుకల్లో రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. అష్టోత్తర శత వైష్ణవ దివ్యక్షేత్రాల్లో ప్రముఖమైనది, 'దక్షిణ తిరుపతి'గా పేరొందిన తంజావూరు జిల్లా కుంభకోణం సమీపం తిరునాగేశ్వరం ఒప్పిలియప్పన్ ఆలయంలో వేంకటాచలపతి స్వామివారి ఆయలం ఉంది. ఈ క్షేత్రం విశేషాలపై నమ్మాళ్వార్లు, తిరుమంగైయాళ్వారు, పొయ్‌గైఆళ్వారు, పేయాళ్వారు మంగళాశాసనమొనర్చారు. ఈ ఆలయంలో 12 రోజుల పంగుణి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. గత తొమ్మిది రోజులుగా ఉత్సవర్లు పొన్నప్పన్, భూమాదేవి సమేతుడై ప్రత్యేక అలంకరణలో వివిధ వాహనాల్లో, పల్లకీల్లో ఆలయ మాఢ వీధుల్లో విహరించారు. ఈ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన మహారథోత్సవం మంగళవారం ఉదయం ప్రారంభమైంది. వేంకటాచలపతి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్ర దినాన ఈ రథోత్సవం జరుగటంతో భక్తులు వేల సంఖ్యలో మంగళవారం వేకువజామును ఆలయ ప్రాంతానికి చేరుకున్నారు. రథోత్సవం సందర్భంగా ఆలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆ తరువాత అలంకరించిన మహారథం పీఠంపై భూమాదేవి సమేతుడై పొన్నప్పర్ స్వామి సర్వాలంకరణశోభితులై ఆశీనులయ్యారు. ఆ తర్వాత రథానికి ఇరువైపులా నిలిచిన భక్తులు మోకుతాళ్ళను పట్టుకుని రథాన్ని లాగారు. ఈ మహారథానికి ముందు ఆలయ గజం 'భూమ' పట్టపుటేనుగు నడచుకుంటూ వెళ్లింది. రథం వీధుల్లో అమ్మవారి వేషాలు ధరించిన యువతులు నృత్యాలు చేశారు. కొంతమంది గ్రామీణ కళాకారులు కీలుగుర్రం నృత్యాలు చేశారు. మంగళవాయిద్యం, చండీమేళ వాయిద్యం, వైష్ణవపండితుల మంత్రోచ్చారణ నడుమ మహారథాన్ని చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. చివరగా ఈ రథం రథమండప ప్రాంతానికి తిరిగి రాగానే ఆలయ పుష్కరిణిలో తీర్థవారి వేడుకలు కూడా జరిగాయి. ఈ వేడుకల ముగింపు రోజైన ఈ నెల 28 ఉదయం మూలవర్ల సన్నిధిలో 'అన్నపెరుంపడయల్' (మహా అన్నాభిషేకం), సాయంత్రం పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ హంసన్, ట్రస్టు బోర్డు అధ్యక్షులు, సభ్యులు ఏర్పాట్లు చేపడుతున్నారు. రథోత్సవం సందర్భంగా ప్రధాన వీధుల్లో ఆలయ నిర్వాహకులు చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, పానకం, పండ్ల రసాలను భక్తులకు పంపిణీ చేశారు. మధ్యాహ్నం స్థానిక భక్త సంఘాల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు కూడా జరిగాయి.

బన్నారియమ్మన్ ఆలయ అగ్నిగుండ వేడుకలకు శ్రీకారం





వేడుకలలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులు - బన్నారిమారియమ్మన్ వద్ద పూలవరం (అనుమతి) కోరేందుకు, అమ్మవారి అలంకరణ వస్తువులను మోసుకెళుతున్న ప్రధాన పూజారి

టి.నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న బన్నారిమారియమ్మన్ ఆలయ పంగుణి మాస అగ్ని గుండ ప్రవేశ వేడుకలు మంగళవారం వేకువజాము అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ నుండి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సుమారు 3 వేలమంది భక్తులు వ్రతమాచరించి వేకువజాము నాలుగు గంటలకే తీర్థకొలనులో స్నానమాచరించి పవిత్ర జలాలను ఆలయానికి మోసుకెళ్ళారు. ఆ తర్వాత అగ్నిగుండ ప్రవేశానికి అమ్మవారిని పూలవరం (అనుమతి) కోరే కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన పూజారి నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ, వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇక బుధవారం నుండి అమ్మవారిని సప్పరాల్లో సమీప గ్రామాల్లో ఊరేగించనున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏప్రిల్ 7, 8 తేదీలలో అగ్ని గుండం ప్రవేశ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



మీడియా సమావేశంలో నిఖిల్ చందన్, పింకూ భారతి తదితరులు

కీలకదశలో రైడ్-హెయిలింగ్ పరిశ్రమ

● 'టాక్సీ నా' నిర్వాహకులు

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో రైడ్-హెయిలింగ్ పరిశ్రమ కీలకదశలో వుందని, స్థిరమైన పార్యవరణ వ్యవస్థ ఇప్పుడు అవసరమని 'ట్యాక్సీ నా' సీఈవో నిఖిల్ చందన్, ఎండీ పింకు భారతి పేర్కొన్నారు. చెన్నై ప్రధాన కేంద్రంగా వున్న నవయుగ గ్లోబల్ వెంచర్స్ నుంచి 15 మిలియన్ల నిధులను సేకరించిన సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ఈ పెట్టుబడి ట్యాక్సీ తన ప్రత్యేకమైన, స్థిరమైన రైడ్-హెయిలింగ్ మోడల్ స్థిరం చేసుకోవడానికి వీలు కల్పిస్తుందన్నారు. ట్యాక్సీ నా రైడ్-హెయిలింగ్ యాప్, సహాయక పర్యావరణ వ్యవస్థతో కూడిన స్థిరమైన నామూనా అభివృద్ధి చేసిందన్నారు. ఈ నమూనా కమీషన్లు, లక్ష్యాలను తొలగించడం, పారదర్శక ధర అందించడం, డ్రైవర్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ పెంపొందించడం, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడుతుందని వివరించారు.

ఘనంగా ద్రౌపదియమ్మన్ అగ్నిగుండ మహోత్సవం



ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి

తిరుత్తణి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని పొదటూర్‌పేటలో ప్రసిద్ధిచెందిన ద్రౌపది సమేత ధర్మరాజు ఆలయంలో అగ్నిగుండం వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ నెల 3వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో ప్రధాన అంశమైన అగ్నిగుండ ఘట్టం మంగళవారం ప్రారంభం కాగా, వేలాది సంఖ్యలో వచ్చిన భక్తులు అగ్నిగుండం తొక్కి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మంగళవాయిద్యాల నడుమ ఆలయ పూజారులు వేదమంత్రోచ్చారణ నడుమ ఆలయ కలశాలను అగ్నిగుండం దగ్గరకు చేర్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తును పురవీధుల్లో ఊరేగించారు. మార్చి 3న ప్రారంభమైన ఈ ఉత్సవాలు, మంగళవారం సాయంత్రం ధర్మరాజస్వామి పట్టాభిషేక ఘట్టంతో ముగిశాయి. ఈ అపూర్వ ఘట్టాన్ని దర్శించేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు వివిధ రాష్ట్రాలను నుండి పెద్దసంఖ్యలో వచ్చే భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు వసతులు సమకూర్చారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ కందన్ నేతృత్వంలోని పోలీసుల బృందం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసింది.



అగ్నిగుండం

హొగెనేకల్‌లో పెరిగిన ఇన్‌ఫ్లో



జళకళ సంతరించుకున్న హొగెనేకల్ జలపాతం

టి.నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కావేరి నదీ పరివాహక ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో గత వారం రోజులుగా హొగెనేకల్ జలపాతంలోకి వచ్చే నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ప్రధాన జలపాతం, ఐందరువి, సినీ ఫాల్స్ తదితర జలపాతాలు జలకళ సంతరించుకున్నాయి. పర్యాటకులు కుటుంబ సమేతంగా దోనెల సవారీ చేస్తున్నారు. హొగెనేకల్ జలపాతంలో ఇన్‌ఫ్లో అధికావటంతో కావేరి వాగులో నీటి ఉధృతిని తమిళనాడు - కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన బిలిగుండ్లు వద్ద కేంద్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు నిఘా వేస్తున్నారు.



టీఎన్‌సీసీ మాజీ నేత ఇలయపెరుమాళ్ ‌కు కడలూరు జిల్లా చిదంబరంలో స్మారక మండపం నిర్మాణానికి ఆదేశాలిచ్చిన సీఎం స్టాలిన్‌ను సచివాలయంలో కలుసుకుని ధన్యవాదాలు తెలుపుకుంటున్న ఆ దివంగత నేత కుటుంబ సభ్యులు



జవహర్‌లాల్ ఇండోర్ స్టేడియంలో 'డబ్ల్యూటీటీ స్టార్ కంటెన్డర్ 2025' టేబుల్ టెన్నిస్ ట్రోఫీని పరిచయం చేసి పోటీ తిలకిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



తమిళ- ఇండో- యూరోపియన్ పదబంధాల తులనాత్మక నిఘంటువును సచివాలయంలో ఆవిష్కరించి తొలిప్రతిని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రచురణ సంస్థ భారతీయ విభాగం మేనేజింగ్ డైరెక్టర్ సుగంధ దాస్‌కు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

కీళడి మ్యూజియం సందర్శించిన వడివేలు



ప్రాచీన వస్తువుల గురించి తెలుసుకుంటున్న వడివేలు

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సీనియర్ హాస్య నటుడు వడివేల్ ఇటీవల కీళడి మ్యూజియాన్ని వీక్షించారు. శివగంగ జిల్లా త్రిభువనంసమీపం కీళడిలో కేంద్ర ప్రభుత్వ మూడవ పురావస్తు పరిశోధన చేపట్టింది. అలాగే, రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో కీళడి, కొందగై, అగరం తదితర ప్రాంతాల్లో 10 విడతలుగా పురావస్తు పరిశోధనలు చేపట్టారు. పరిశోధనల్లో భాగంగా జరిపిన తవ్వకాల్లో మట్టిపాత్రలు సహా 18వేల పురాతన వస్తువులు లభ్యమయ్యాయి. వాటితో ఏర్పాటు చేసిన కీళడి మ్యూజియంను సోమవారం వీక్షించారు. అదే సమయంలో తవ్వకాలు చేపట్టిన కీళడి వడివేలు తల్లి జన్మించిన గ్రామం కావడంతో, ఈ మట్టిలో ప్రాచీన కాలం నాటి విశేషాలు లభ్యం కావడం ఆనందంగా ఉందని వడివేలు తెలిపారు.

ఉగాది సందర్భంగా తిరుమల ఆలయం శుద్ధి





ఈనెల 30న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయశుద్ధి) ఆగమోక్తంగా జరిగింది. శ్రీవారి ఆలయం ఆనంద నిలయం మొదలు కొని, బంగారు వాకలి, ఆలయంలోని ఉప ఆలయాలు, గోడలు, పైకప్పు, పూజాసామాగ్రిని శుద్ధి చేశారు. అనంతరం పరిమళ జలాన్ని ఆలయ మంతా ప్రోక్షణం చేశారు. ఈకార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావుతో కలిసి పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


తిరుమలలో నేడు అన్నమయ్య వర్ధంతి

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాన్ని టీటీడీ బుధవారం తిరుమలలో నిర్వహించనుంది. ఈసందర్భంగా శ్రీవారి ఆలయం నుంచి శ్రీమలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా ఊరేగింపుగా బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు నారాయణగిరి ఉద్యానవనాలకు చేరుకుంటారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహించనున్నారు.

టీటీడీ సర్వశ్రేయస్ ట్రస్టుకు రూ.10.11 లక్షల విరాళం

తిరుమల, మార్చి25(ఆంధ్రజ్యోతి): టీటీడీ సర్వశ్రేయస్ ట్రస్టుకు మంగళవారం రూ.10.11 లక్షలు విరాళంగా అందింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన గౌరవ్ ఐరెన్ అనే భక్తుడు ఈ విరాళాన్ని డీడీ రూపంలో తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి అదజేసి సర్వశ్రేయస్ ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు భారీగా క్యూలైన్‌లో వేచి ఉన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.45 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,358
తలనీలాలు సమర్పించినవారు: 27,024

ముగిసిన ప్లస్‌టూ పరీక్షలు

● 28 నుండి టెన్త్ ప్రారంభం





పరీక్షలు ముగిసిన వెంటనే సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థినులు - మళ్ళీ ఎప్పుడు కలుస్తామో...

ప్యారీస్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 3నుండి ప్రారంభమైన ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈ పరీక్షల కోసం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ 3,316 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసింది. పరీక్షల సమయంలో కాపీయింగ్ తదితర అవకతవకలను అడ్డుకునేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, 4,470 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలుఆకస్మిక తనిఖీలు చేశాయి. ఇవి కాకుండా జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులతో ఏర్పాటైన నిఘా కమిటీలు కూడా తమ బాధ్యతను నిర్వర్తించాయి. ఇదిలా వుండగా ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల చివరి రోజైన మంగళవారం విద్యార్థులు ఆయా పరీక్షా కేంద్రాల నుండి మౌనంగా బయటికి వెళ్ళేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందు కోసం పాఠశాల ప్రాంగణాలు, బయట పోలీసులు విధుల్లో పాల్గొన్నారు. కాగా, ఈ నెల 5న ప్రారంభమైన ప్లస్‌వన్ పరీక్షలు ఇంకా జరుగుతుండగా, 28 నుండి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది.

సీఐఎస్ఎఫ్ సైక్లథాన్ జవాన్లకు మెరీనాబీచ్‌లో అపూర్వ స్వాగతం





సీఐఎస్ఎఫ్ సైక్లథాన్ బృందంతో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్లు శ్రీకాంత్, మహేంద్రసింగ్ ధోని, సినీనటుడు పార్తీబన్ - జేజేలు పలుకుతున్న మహిళలు



సైక్లథాన్ బృందం

అడయార్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాబీచ్‌లో మంగళవారం సాయంత్రం సీఐఎస్ఎఫ్ సైక్లథాన్ 2025 బృందానికి అపూర్వ స్వాగతం లభించింది. కోస్తాతీర భద్రతపై తీర ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వారిలో అవగాహన కల్పించేందుకు 'సీఐఎస్ఎఫ్ సైక్లథాన్-2025' పేరుతో సైకిల్ ర్యాలీని రాణిపేట జిల్లా, తక్కోలం వద్ద కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ నెల 7 న వర్చువల్‌గా ప్రారంభించిన విషయం విదితమే. ఈ బృందంలో 14 మంది మహిళా జవాన్లు సహా 120 మంది ఉన్నారు. మొత్తం 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల మీదుగా ఈ ర్యాలీ సాగనుంది. మెరీనాబీచ్‌లో మంగళవారం సాయంత్రం ఈ బృందానికి రెడ్ కార్పెట్ స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నిధి చౌదరి, క్రికెటర్లు శ్రీకాంత్, ధోనీ, దర్శక నటుడు పార్తీబన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సీఐఎస్ఎఫ్‌కి చెందిన మహిళలు, ప్రముఖులు అధికారులు ఈ బృందం సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

వెల్లయంగిరి వెళ్లిన భక్తుడి మృతి

వేళచ్చేరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా వెల్లయంగిరి కొండకు వెళ్లిన భక్తుడు ఊపిరాడక మృతిచెందాడు. తిరువణ్ణామలై జిల్లా పళయనూరు గ్రామానికి చెందిన శివ (40) కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో 20 ఏళ్లుగా పండ్ల దుకాణం నడుపుతున్నాడు. శివ ఈ నెల 24న బంధువులు, స్నేహితులతో కలిసి వెల్లయంగిరి కొండ ఆలయానికి వెళ్లాడు. కొండ శిఖరంపై ఆలయానికి వెళ్లి స్వామి దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణమయ్యాడు. మూడో కొండ దిగుతున్న సమయంలో శివ హఠాత్తుగా శ్వాస తీసుకోలేదక ఇబ్బంది పడుతూ స్పృహతప్పి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కాగా, రెండేళ్ల క్రితం గుండె సంబంధిత సమస్యలతో బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిసింది. అనారోగ్యంగా ఉన్న వారు వెల్లయంగిరి కొండకు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నా, పలువురి వచ్చి మృత్యువాత పడుతున్నారు.



వేలూరు పంచాయతి యూనియన్ కరుగమ్ చిత్తూర్ పంచాయతీలో జిల్లా సమాచార శాఖ ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల ఎగ్జిబిషన్‌ను వీక్షిస్తున్న ప్రజలు

గంటలో ఏడుగురి వద్ద చైన్ స్నాచింగ్

విమానంలో పారిపోతున్న ఇద్దరి అరెస్టు

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చెన్నై మీనంబాక్కం విమానాశ్రయానికి సమీపంలోని రహదారిలో మంగళవారం ఉదయం బైకులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు గంటలో ఏడుగురు మహిళల మెడలోని గొలుసులను అపహరించారు. ఆ తర్వాత వారిద్దరూ వేర్వేరు విమానాల్లో పారిపోయేందుకు ప్రయత్నించి పోలీసులకు చిక్కారు. మంగళవారం ఉదయం మీనాంబాక్కం పోలీసుస్టేషన్ పరిధిలో హెల్మెట్లు ధరించి బైకుపై ఇద్దరు యువకులు వెళ్తూ రోడ్డుపై నడిచి వెళ్తున్న ఏడుగురు మహిళల మెడలోని బంగారు గొలుసులను అపహరించారనే ఫిర్యాదులందాయి. ఆ ఫిర్యాదులపై కేసులు నమోదు చేసుకున్న పోలీసులు ఆయా ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీ పరిశీలించారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు యువకులు హెల్మెట్లు ధరించి ఉండటంతో వారి ముఖాలను స్పష్టంగా గుర్తించలేకపోయారు. అయితే దుండగులు నడిపిన బైకు మీనంబాక్కం జాతీయ విమానాశ్రయం దిశగా వెళ్లడం గుర్తించారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా విమానాశ్రయ పోలీసులను అప్రమత్తం చేశారు. ఆ సమయంలో బయలుదేరటానికి సిద్ధంగా ఉన్న విమానాల వివరాలను కనుకొన్నారు. ఆ మేరకు హైదరాబాద్‌కు బయలుదేరనున్న ఇండిగో విమానంలో కొంతమంది పోలీసులు, ముంబాయి వెళ్లే ఎయిర్ ఇండియా విమానంలోకి కొందరు పోలీసులు ప్రవేశించి ప్రయాణికులందరినీ పరిశీలించారు. ఆ సమయంలో ఇండిగో విమానంలో ఓ యువకుడు, ఎయిర్ ఇండియా విమానంలో మరో యువకుడు పోలీసులను చూసి గాభరా పడ్డారు. దీంతో వారిని పోలీసులు విమానం నుంచి దిగి పోలీసుస్టేషన్‌కు తరలించి విచారణ జరిపారు. ఆ విచారణలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడింది వారేనని కనుగొన్నారు. వారిద్దరూ ఉత్తరాది వారని పోలీసులు తెలిపారు.

రాధాత్రి నేత్రాలయానికి ఫోర్బ్స్ ఇండియా విరాళం



నేత్రాలయ ప్రతినిధులకు వాహనం అందజేస్తున్న ఫోర్బ్స్ చైర్మన్ ఎస్వీ వీరమణి

పెరంబూర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గురుప్రియ విజన్ రీసెర్చి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న రాధాత్రి నేత్రాలయం సామాజిక సేవలో భాగంగా 'టెలీఆప్తాల్మాలజీ' ప్రాజెక్ట్ చేపట్టింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల పిల్లలకు కంటి సంబంధిత పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో ఇప్పటివరకు లక్ష మంది కంటి పరీక్షలు చేసి, పేద కుటుంబాలకు చెందిన 4,500 మంది చిన్నారులకు లేజర్ చికిత్స అందించారు. ఈ సేవలు మరింత విస్తృతం చేయాలనే ఆకాంక్షతో రాధాత్రి నేత్రాలయం ట్రస్ట్‌కు ఫోర్బ్స్ ఇండియా, రోటరీ క్లబ్ ఆఫ్ అడయార్ సంయుక్తంగా వాహనం అందించాయి. నగరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో గురుప్రియ విజన్ రీసెర్చి ఫౌండేషన్ ప్రతినిధులు కృష్ణన్‌చారి, ప్రవీణ్ కృష్ణ, వాసుమతి వేదాంతం, ఫోర్బ్స్ ఇండియా చైర్మన్ ఎస్వీ వీరమణి, కుమారవేల్, త్యాగరాజన్, సేతురామన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి లక్కీడిప్‌లో కన్సొలేషన్ బహుమతులు

కూపన్లు తీసి 125 మంది పాఠకుల ఎంపిక



కన్సొలేషన్ బహుమతుల కూపన్లను తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' పాఠకులు

1. ఆర్.మౌనిష్‌కుమార్, చిత్తూరు
2. జి. వినోద్, పూతలపట్టు
3. కె. పద్మావతి, తిరుపతి
4. జి. సుబ్బరత్నమ్మ , కందూరు, సోమల.
5. ఎ. రుత్విక, తిరుపతి
6. సి. నాగరాజు, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు.
7. సి. రామయ్య, పలమనేరు
8. ఎస్. భానుప్రకాష్, బందార్లపల్లి, పూతలపట్టు
9. కె. పల్లవి, మదనపల్లి
10. కె. భాస్కరయ్య, బెంగుళూరురోడ్డు, మదనపల్లి
11. పి. క్రిష్ణయ్య, కట్టకింద వెంకటాపురం, రామచంద్రాపురం
12. ఎ.తేజేష్‌రెడ్డి, పాకాల
13. పి. కళ్యాణ్‌కుమార్, తిరుపతి
14. ఎం. రాజేశ్వరి, రొంపిచెర్ల
15. ఎం.ఎన్.కరుణామాత, కలికిరి
16. ఎ.భాస్కర్, పలమనేరు
17. ఆర్. నిఖిత, అంగళ్లు, కురబలకోట
18. పి.ప్రభాకర్, పుంగనూరు
19. వి. సౌందర్యరాణి, విద్యానగర్ కాలనీ, తిరుపతి రూరల్
20. ఎం.మునిరత్నం నాయుడు, సి.మల్లవరం, తిరుపతి రూరల్
21. పి. వీరరాఘవులు, 10-మినిస్టర్ ఏరియా, చెన్నై
22. దీపక్ మనీషా, తిరుపతి
23. షేక్‌అన్వర్ బాషా, రేణిగుంట
24. వై. లీలావతమ్మ , ఖాదీకాలనీ, తిరుపతి
25. ఎ.నాగరాజు, శ్రీరాంనగర్, పుంగనూరు
26. కె.యుగంధర్, కొండకిందపల్లి, పూతలపట్టు
27. డాక్టర్ కె.ఈశ్వర్‌బాబు, వజ్జిరెడ్డిపల్లి, పూతలపట్టు
28. జే. రేవతి, కలికిరి
29. ఆర్.క్రిష్ణమూర్తి, పాత అలిపిరి రోడ్డు, తిరుపతి
30. ఎన్.మమత, రాజీవ్‌గాంధీనగర్ కాలనీ, తిరుపతి
31. ఎన్.గోవిందస్వామి, నంగమంగళం, గుడిపాల
32. కె. దామినిప్రియ, స్టాఫ్ క్వార్టర్స్, తిరుపతి
33. ఎం.నటరాజ్‌శెట్టి, బేరివీధి, కార్వేటినగరం
34. ఎల్.కమల్‌క్రిష్ణ, మధురానగర్, తిరుపతి
35. ఎ. స్వర్ణ, కొంకావీధి, తిరుపతి
36. పి. వెంకటరమణ, మంగళంపేట, పులిచెర్ల
37. కె.ఓంప్రసాద్, జీవకోన, తిరుపతి
38. టి. రామిరెడ్డి, అంబేద్కర్‌కాలనీ, చంద్రగిరి
39. వి.ఎస్. హర్షవర్ధన్, సంతపేట, చిత్తూరు
40. ఎం. భార్గవి, విజయ్‌నగర్ కాలనీ, మదనపల్లి
41. డి. సాయిఫణీంద్ర, శంకర్‌నాయుడు కాలనీ, తిరుచానూరు
42. ఎ. రమేష్, రెడ్‌క్రాస్ స్ట్రీట్, చిత్తూరు
43. సి.ఎం. చౌడప్ప, రామకుప్పం
44. ఎన్. గజపతి, తూగుండ్రం, జి.డి.నెల్లూరు
45. టి. నరసింహులు, బంగారుపాళెం
46. డాక్టర్ వి. శ్రీనివాసులునాయుడు, పోస్టల్ కాలనీ, తిరుపతి
47. ఎస్. మాధవన్, దొడ్డిపల్లి, చిత్తూరు
48. జి. చంద్రశేఖర్, శేషప్పతోట, మదనపల్లి
49. ఎ. రమేష్, మిట్టూరు, చిత్తూరు
50. కె. అమల, వైకుంఠపురం, తిరుపతి
51. జి.సునీల్, చింతపర్తి, వాయల్పాడు
52. జి. సుబ్రమణ్యం, ఎన్‌జిఓ కాలనీ, తిరుపతి
53. ఎన్.ఆర్. రఘుమ, ఎస్‌బిఐ కాలనీ, మదనపల్లి,
54. ఎస్. చిరంజీవులు రెడ్డి , కార్వేటినగరం
55. ఎస్. అరుణాచలం, కొప్పేడు హరిజనవాడ, నింద్ర
56. ఎస్. ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రామకుప్పం
57. వి.లోహిత్‌కుమార్, కొంగారెడ్డి పల్లి, చిత్తూరు
58. ఎ. సురేష్, మునగలపాలెం, ఏర్పేడు
59. ఎస్. చర్వాణిశ్రీ, పి.కె. లేఔట్, తిరుపతి
60. వి. జ్యోతిష్మతి, గాంధీరోడ్డు, తిరుపతి
61. పి. రాంబాబు, కొర్లగుంట, తిరుపతి
62. భ్రమరాంబ, సత్యనారాయణపురం, తిరుపతి
63. కె. వెన్నెల, అన్నాసంపల్లి, రేణిగుంట
64. యామిని, ఎస్టీవి నగర్, తిరుపతి
65. జి.నాగభూషణమ్మ, ఎయిర్ బైపాస్‌రోడ్డు, తిరుపతి
66. బి.మోహనరంగారెడ్డి, శివాలయంవీధి, వరదయ్యపాలెం
67. శిల్పిక, వైష్ణవి నగర్, తిరుచానూరు
68. బి.ఎం.ఇందిరాకుమార్, హర్షిత హోటల్, వి.కోట
69. బి.మంజునాథ్, నడివీధి, వి.కోట
70. వి.రామచంద్రయ్య, రాధాక్రిష్ణ స్ట్రీట్, తిరుత్తణి
71. కె. క్రిష్ణమూర్తి, కెప్టెన్ లక్ష్మి వీధి, మదనపల్లి
72. డి. గంగాముని ప్రసాద్, పంట వీధి, తిరుపతి
73. వి. ఆనందరావు, ఎస్.డి.లేఔట్, తిరుపతి
74. సాహిద్‌షబీనా బేగం, తిరుచానూరు
75. జె.రాధాక్రిష్ణ, బాసరివీధి, వడమాలపేట
76. ఎస్.హర్షిణి, ముద్దుక్రిష్ణాపురం, పుత్తూరు
77. బి. కవిత, గాంధీపురం, తిరుపతి రూరల్
78. ఎం. రజని, చిత్తూరు
79. ఎ. శివమోహన్, లక్ష్మీనగర్ కాలనీ, పలమనేరు
80. డి. మోహన్, కె.టి.క్వార్టర్స్, తిరుపతి
81. డి. ప్రభాకర్, పుదిపట్ల, తిరుపతి రూరల్
82. కె. ధనలక్ష్మి, శాంతినగర్, తిరుపతి
83. డి.అశోక్, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు
84. టి. గిరిధర్, బాలాజీ కాలనీ, తిరుపతి
85. కె.ఆర్.పూజిత, మురకంబట్టు, చిత్తూరు
86. హేమ, ఆవులపెద్దిరెడ్డిగారి పల్లి, పులిచెర్ల
87. జి.సుభాషిణి, శివజ్యోతినగర్, తిరుపతి
88. జి.క్రిష్ణమనాయుడు, జీవకోన, తిరుపతి
89. ఎ.మేఘ, బి.ఎన్. కండ్రిగ
90. సుజాత, భారతినగర్, చంద్రగిరి
91. వి. జయంతి, శ్రీనగర్ కాలనీ, పలమనేరు
92. ఎం.శ్రీలక్ష్మి, ట్రిప్లికేన్, చెన్నై
93. వి. రామతులసి, ఆర్.సి.రోడ్డు, తిరుపతి
94. ఎస్. అక్బర్, భగత్‌సింగ్ కాలనీ, రేణిగుంట
95. సి.ఆర్.సమీరారెడ్డి, గంగవరం
96. ఎస్. విజేత, మాధవనగర్, తిరుపతి
97. డి. వెంకటరమణ, పెరుమాళ్లపల్లి, తిరుపతి
98. ఎం. సుబ్బరామిరెడ్డి, తోటపల్లి, పాకాల
99. పి. సతీష్‌కుమార్, నిమ్మనపల్లి
100. డి. వరలక్ష్మి, మాతమ్మగుడి వీధి, తిరుపతి
101. వి.భువన్‌కుమార్, అంజిమేడు, ఏర్పేడు
102. ఎస్. అక్బర్ జమీర్, రాంనగర్ కాలనీ, చిత్తూరు
103. పి. కాంతమ్మ, వేపమానువీధి, తిరుచానూరు
104. డి. శ్రీలేఖ, ఎస్.వి.నగర్, తిరుపతి
105. పి.వేణు, ఐతేపల్లి, చంద్రగిరి
106. పి. శ్రీనివాసులు, శ్రీనగర్‌కాలనీ, పలమనేరు
107. జి. భువనేశ్వరి, కె.కె. లేఔట్, తిరుపతి
108. పి.సుల్తాన రజియా, మునిరెడ్డినగర్, తిరుపతి
109. బి. ఉదయశంకర్, భగత్‌సింగ్ కాలనీ, పుంగనూరు
110. డి. వేణుగోపాల్, లక్ష్మీపురం, తిరుపతి
111. సుభద్ర, న్యూకాలనీ, చెన్నై
112. కె. కామేశ్వరరావు, ఉప్పరపల్లి, తిరుపతి
113. కె. వెంకోబరావు, డి.ఆర్.మహల్‌రోడ్డు, తిరుపతి
114. కె. యువరాజు, సత్యనారాయణపురం, తిరుపతి
115. ఎం. శ్రీనివాసులు, శివజ్యోతినగర్, తిరుపతి
116. పి. ముఖేష్, జీవకోన, తిరుపతి
117. ఎన్.రెడ్డీశ్వరి, సదుం
118. కె.ఎం. ఉషారాణి, ఎం.బి.రోడ్డు, పుత్తూరు
119. కె. తేజశ్రీ, రాటకొండ సరస్వతమ్మ వీధి, మదనపల్లి
120. పి.వి.దివ్యసాయి, గాంధీనగర్, కుప్పం
121. ఎం. రోహిత్, నిమ్మనపల్లి,
122. ఎ. జనార్ధన్‌రెడ్డి, గంగవరం
123. జి. కల్పన, గుంతలపేట, రామసముద్రం
124. ఎస్. సతీష్, రజకవీధి, పుత్తూరు
125. జి. చిరంజీవి, రాజీవ్ నగర్, మదనపల్లి

కేసీజీ టెక్నాలజీ కాలేజీలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



వేడుకల్లో పాల్గొన్న ప్రేమ్‌జీకి పుష్పగుచ్చం అందజేస్తున్న నటుడు వైభవ్‌రెడ్డి, చిత్రంలో నటి కయడు లోహర్, కళాశాల నిర్వాహకులు

చెన్నై, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసీజీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో 'ఎథిరియల్-2025' పేరుతో రెండు రోజులపాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంగీతం, నృత్యం, సాహిత్యంతోపాటు వివిధ క్రీడా పోటీలు కూడా జరిపారు. బాక్స్ క్రికెట్, ఫుట్సల్, షటిల్ స్ట్రైకర్, షిప్‌వాక్, ఫ్రీఫైర్ వంటి క్రీడాపోటీలలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. హిందుస్థాన్ గ్రూప్ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ జేకబ్, కేసీజీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ అన్ని జేకబ్, గేయరచయిత అనల్ కోలార్, సినీనటులు ప్రేమ్‌జీ, వైభవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.